సాక్షి అనకాపల్లి

సోమవారం । 9 । జూన్ । 2025



సందడిగా తీరం

ఎస్.రాయవరం:వీకెండ్ కావడంతో రేవు పోలవరం తీరం ఆదివారం సందర్శకులతో కళకళలాడింది.

ఉష్ణోగ్రతలు

ఆదివారం

		గరిష్టం/కనిష్టం
అనకాపల్లి	:	37.0/24.2
చోడవరం	:	37.0/26.0




11న ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె నోటీస్

విజయనగరం జోనల్ పరిధిలో గల కలెక్ట ర్లకు 11న సమ్మె నోటీసు అందజేయనున్నట్టు ఎన్ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తెలిపారు.

8లో

న్యూస్‌రీల్

నిండుకుండలా పెద్దేరు



పెద్దేరు జలాశయం

మాడుగుల: మండలంలో కురుస్తున్న వర్షాలకు నీరు చేరి పెద్దేరు జలాశయం నిండుకుండలా కళకళలాడుతోంది. జలాశయంలోకి నీరు పుష్కలంగా చేరడంతో ఖరీఫ్‌కు కలసి వస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెద్దేరు ఖరీఫ్ ఆయకట్టు సుమారు 15 వేల ఎకరాలు. ఇప్పటికే రైతులు వరి నారుమడులు సిద్ధం చేశారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 136.50 మీటర్లకు చేరుకుంది. ప్రస్తుతం జలాశయంలోకి 50 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. వర్షాలు అధికమైతే పెద్దేరు గేట్లు ఎత్తవలసి ఉంటుందని జలాశయం జేఈ సుధాకర రెడ్డి తెలిపారు. రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి పూట పెద్దేరులోకి దిగవద్దని జేఈ సూచించారు.

ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో చౌడువాడ విద్యార్థిని ప్రతిభ

- అగ్రికల్చర్ ఫార్మసీలో రాష్ట్ర స్థాయిలో 144వ ర్యాంక్



రాజి మనీషా సాయికుమారి

కె.కోటపాడు : ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో మండలంలో చౌడువాడ గ్రామానికి చెందిన రాజి మనీషా సాయి కుమారి ప్రతిభను కనబర్చింది. అగ్రికల్చర్ ఫార్మసీలో రాష్ట్ర స్థాయిలో 144వ ర్యాంక్‌ను సాధించింది. ఇంటర్‌లో బైపీసీ చదివి, 986 మార్కులు సాధించినట్టు ఆమె తండ్రి సత్యనారాయణ తెలిపారు. కుమార్తె అగ్రికల్చర్ ఫార్మసీలో రాష్ట్ర స్థాయిలో ర్యాంక్‌ను సాధించడం ఆనందంగా ఉందని తండ్రి సత్యనారాయణ, తల్లి సోనియా పేర్కొన్నారు.

ఏసీబీలో దొంగాట!



'గిరి'గీసి మరీ వసూళ్లు

రిజిస్ట్రేషన్లు, రవాణా శాఖ నుంచి భారీగా మామూళ్లు?

చక్రం తిప్పుతున్న ఓ డాక్యుమెంట్ రైటర్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

కంచే చేను మేసిన చందంగా మారిపోయిందనే విమర్శలు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వ్యవహారంలో వినిపిస్తున్నాయి. అవినీతి నిరోధానికి కృషి చేయాల్సిన సొంత శాఖకు చెందిన కొందరు అధికారులే నెలవారీ మామూళ్లకు అలవాటుపడి సమాచారాన్ని లీకు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలోనే గతంలో ఓ సీఐ స్థాయి అధికారిని బదిలీ చేసినట్టు తెలుస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లా కేంద్రంగా రిజిస్ట్రేషన్లతో పాటు రవాణాశాఖ నుంచి ప్రతీ నెలా కొద్ది మంది నెలవారీ మామూళ్లు అందుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి. సొంత శాఖకు చెందిన ఓ ఎస్ఐ, ఏఎస్ఐతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. అయితే, రిజిస్ట్రేషన్లశాఖ నుంచి మామూళ్లు ముట్టచెప్పడంలో ఓ డాక్యుమెంట్ రైటర్ ప్రధాన పాత్ర పోషిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రతీ నెలా 'గిరి'గీసి మరీ ఠంచనుగా కొద్ది మంది కీలకమైన అధికారుల నుంచి వసూలు చేసి ముట్టచెబుతున్నట్టు సమాచారం. అయితే ఈ మామూళ్ల వ్యవహారంలో ఎవరెవరికి ఎంత అందుతుందనే విషయంలో మొదలైన చర్చ రచ్చ కావడంతో ఈ వ్యవహారం పైదాకా వెళ్లినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించినట్టు ఆ శాఖలో గుసగుసలు వినపడుతున్నాయి. మొత్తంగా అవినీతిని కట్టడి చేయాల్సిన అధికారులే అవినీతి రొంపిలో కూరుకుపోతుండటం మాత్రం విస్తుగొలుపుతోంది.

ముందుగానే సమాచారం లీకు...!

వాస్తవానికి ఏసీబీలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఉన్న కొద్దిమంది సమర్థులైన అధికారులు ఇతర ప్రాంతాలకు బదిలీ చేయించుకుని వెళ్లిపోతున్నారు. ప్రస్తుతం ఒక ఉన్నతాధికారిపై ఎలాంటి ఆరోపణలు లేకపోయినప్పటికీ, కిందిస్థాయిలో పేరుకుపోయిన కొందరు అవినీతి సిబ్బందిపై ఆయన సరైన స్థాయిలో చర్యలు తీసుకోలేకపోతున్నారనే విమర్శలున్నాయి. ఏసీబీలో దీర్ఘకాలంగా తిష్ట వేసిన ఒక ఎస్ఐతో పాటు ఏఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు సంస్థ పరువును నెలవారీ మామూళ్ల కోసం బజారున పడేస్తున్నారని ఆరోపణలున్నాయి. ముఖ్యంగా అవినీతి ఆరోపణలున్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖతో పాటు రవాణా, జీవీఎంసీ, రెవెన్యూ, మైనింగ్ శాఖల నుంచి వీరు నెలవారీ మామూళ్లకు అలవాటు పడినట్లు తెలుస్తోంది. అవినీతి ఆరోపణలున్న సదరు నలుగురు సిబ్బంది డిపార్ట్‌మెంట్ల వారీగా వసూళ్లకు తెగబడుతున్నట్లు సమాచారం. ఇంకా ఎక్కడి నుంచైనా ఫిర్యాదులు వచ్చిన వెంటనే సంబంధిత శాఖకు ముందుగానే సమాచారాన్ని లీక్ చేస్తున్నారని విమర్శలున్నాయి. ఒకవేళ ఎవరైనా తమ నెలవారీ మామూళ్లకు అంగీకరించకపోతే, వీరే వేరే పేర్లతో ఫిర్యాదు చేసి సదరు అధికారిపై దాడులు చేస్తారనే అపప్రద కూడా ఉంది. ఈ వ్యవహారంలోనే ఒక జీవీఎంసీ అధికారిని కూడా గతంలో ఇదే తరహాలో ఇబ్బంది పెట్టినట్లు ఆ శాఖలో చర్చ జరుగుతోంది. అయితే తాము చెప్పినట్లు వింటే వారిపై ఏ ఫిర్యాదు వచ్చినా కాపాడతారనే ధైర్యాన్ని కూడా ఈ సిబ్బంది కల్పిస్తున్నారని తెలుస్తోంది.

కీలకంగా డాక్యుమెంట్ రైటర్..!

ఏసీబీలో నెలవారీ మామూళ్ల వ్యవహారం మరింత ముదురుతోంది. రిజిస్ట్రేషన్లు, రవాణా శాఖల నుంచి వసూలు చేసిన మామూళ్లకు సంబంధించి ఒక సీఐను ఇందులో ఇరికించారని తెలుస్తోంది. మొదట్లో తన విధులను మాత్రమే చూసుకునే సదరు సీఐని, నెలవారీ మామూళ్ల రొంపిలోకి లాగి, చివరికి సొంత శాఖ సిబ్బందే ఆయన్ను అడ్డంగా బుక్ చేసినట్టు ఆరోపణలున్నాయి. దీంతో శాఖ పరువు బజారున పడకుండా, ఈ వ్యవహారాన్ని బయటకు పొక్కకుండా గుట్టుగా బదిలీతో సరిపెట్టినట్టు సమాచారం.

ఈ మామూళ్ల వ్యవహారంలో ఒక డాక్యుమెంట్ రైటర్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ఇతను రిజిస్ట్రేషన్ల శాఖలోని అధికారులతో సన్నిహితంగా మెలుగుతూ నెలవారీ మామూళ్లను అందజేస్తున్నట్లు సమాచారం. సదరు డాక్యుమెంట్ రైటర్ ఓ ఉన్నతాధికారికి (గతంలో పనిచేసిన) అత్యంత సన్నిహితుడని ప్రచారం ఉంది. అందుకే ఎన్నో ఆరోపణలున్నప్పటికీ, రిజిస్ట్రేషన్ల శాఖలోని నలుగురైదుగురు అధికారులపై ఎటువంటి చర్యలూ ఉండవనే విమర్శలున్నాయి.

తాజాగా, ఇదే శాఖకు చెందిన ఒక అధికారి అవినీతికి సంబంధించి పక్కాగా కొన్ని వీడియోలు, ఫొటోలతో సహా అందిన ఫిర్యాదును కూడా పక్కదారి పట్టించారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. భారీ వాణిజ్య భవంతిని నిర్మించి, అద్దెకు పెట్టి అడ్డంగా దొరికినప్పటికీ, ఆ అధికారిని కాపాడారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో భారీగా నగదు చేతులు మారినట్లు సమాచారం. ఏది ఏమైనప్పటికీ, ఏసీబీ పరువును బజారున పడకుండా ఉండేందుకు రహస్యంగా ఉన్నతస్థాయిలో విచారణ జరపాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రాజకీయ పార్టీ కార్యక్రమంలా.. కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

- ఎంపీపీ, జెడ్పీటీసీలకు కనీస సమాచారం ఇవ్వని అధికారులు
- అధికారుల తీరుపై మండల ప్రజాప్రతినిధుల ఆగ్రహం

దేవరాపల్లి: స్థానిక పాత ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కూటమి పార్టీలకు చెందిన రాజకీయ కార్యక్రమం మాదిరిగా నిర్వహించారు. ఈ కేంద్రాన్ని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. అధికారిక కార్యక్రమం అయినప్పటికీ స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైస్ ఎంపీపీలకు కనీసం సమాచారం ఇవ్వకుండా ప్రారంభించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బీసీ కార్పొరేషన్ సహకారంతో మండల స్థాయిలో నిర్వహిస్తున్న ఈశిక్షణ కేంద్రం ప్రారంభోత్సవానికి మండల స్థాయిలో ప్రజాప్రతినిధులైన ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలకు సమాచారం ఇవ్వలేదు. ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా కూటమి పార్టీలకు చెందిన నాయుకులకు ఎలా సమాచారం ఇచ్చారని అధికారులపై పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభానికి మండల స్థాయి కాదుకదా కనీసం గ్రామ స్థాయి అధికారి కూడా హాజరు కాలేదు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న తమకు ప్రయాణ చార్జీలను సమకూర్చాలని కుట్టు శిక్షణకు హాజరైన మహిళలు ఎమ్మెల్యేను కోరారు. స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, పోతల పాత్రునాయుడు, కిలపర్తి భాస్కరరావు, పెద్దాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ కేంద్రంలో మహిళలతో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

విద్యాశాఖ తీరుపై ఎస్జీటీల కన్నెర్ర

- వెబ్ కౌన్సెలింగ్‌కు వ్యతిరేకంగా డీఈవో కార్యాలయ ముట్టడి
- విద్యాశాఖ మంత్రి లోకేశ్ మాట మార్చారంటూ ఆక్షేపణ



విశాఖ డీఈవో కార్యాలయం ముందు ఆందోళనకు దిగిన టీచర్లు

ఆరిలోవ: విద్యాశాఖలో బదిలీల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై గురువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుకో నిబంధన, గంటకో సవరణ, తొలుత ఇచ్చిన హామీని విస్మరించడపై నిరసన గళం వినిపించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఎస్జీటీ) ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విశాఖ జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ఆదివారం ముట్టడించారు. నగరంతో పాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాల నుంచి వందల మంది టీచర్లు ఉదయం 9 గంటలకే డీఈవో కార్యాలయానికి చేరుకొని కదం తొక్కారు. వెబ్ కౌన్సెలింగ్ వద్దు.. మాన్యువల్ కౌన్సెలింగే ముద్దు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి, ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలి అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక స్టీరింగ్ కమిటీ నాయకులు మాట్లాడుతూ ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ చేపడతామని చెప్పి, ఇప్పుడు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామనడం ఆక్షేపణీయమన్నారు. గతంలో విద్యాశాఖ మంత్రి లోకేశ్ మాన్యువల్ కౌన్సెలింగ్ అని మాటిచ్చి, ఇప్పుడు మాట మార్చడం సరికాదన్నారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా వందల ఆప్షన్లు ఇవ్వడం కష్టమన్నారు. మాన్యువల్ ద్వారా అయితే అవసరమైన వాటిలో ఒకదాన్ని ఎంచుకునే అవకాశం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు అభిప్రాయాలు, సూచనలను పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్జేడీ కె.విజయభాస్కర్, డీఈవో ఎస్.ప్రేమ కుమార్‌లకు వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ నాయకులు డి.గోపీనాథ్, ఇమంది పైడిరాజు, టి.చిన్నబ్బాయి, టి.రామకృష్ణారావు, అరుణ్‌కుమార్, వీరభద్రరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారానే న్యాయం



ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారానే న్యాయం జరుగుతుంది. వెబ్ కౌన్సెలింగ్‌లో ఎదురయ్యే ఇబ్బందులను నివారించాలి. వెబ్ కౌన్సెలింగ్‌లో 1,000 నుంచి 2,000 ఆప్షన్లను ఎంచుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. వెబ్ కౌన్సెలింగ్ సమయంలో వాటిని వెతుక్కోవడం కష్టమవుతుంది. దీనివల్ల ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఏర్పడతాయి. ఉపాధ్యాయ సంఘాల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా విద్యాశాఖ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించడం బాధాకరం.

–ఇమంది పైడిరాజు, ఎస్టీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి

మాట మార్చిన విద్యాశాఖ అధికారులు



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బదిలీల కౌన్సెలింగ్‌లో మాన్యువల్ విధానం అవలంబిస్తామని విద్యాశాఖాధికారులు హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని తుంగలో తొక్కుతున్నారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు మాన్యువల్ కౌన్సెలింగ్ కోరుకుంటున్నారు. ఇంతమంది కోరుతున్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాల్సిన కౌన్సెలింగ్ విధానాన్ని పక్కనబెట్టి, ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్న వెబ్ కౌన్సెలింగ్‌ను అమలు చేయడం సరికాదు.

–డి.గోపీనాథ్, పీఆర్‌టీయూ, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు

వైద్యం.. మిథ్య

జిల్లాలో వైద్య సేవలు అధ్వాన స్థితికి దిగజారాయి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారితోపాటు గర్భిణులకు సకాలంలో వైద్య సేవలందడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో పేద రోగులకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత జిల్లాలో మెడికల్ కళాశాల నిర్మాణాన్ని గాలికి వదిలేయడమేకాకుండా.. ప్రజలకు వైద్య సేవలందించడంలోనూ తీవ్ర నిర్లక్ష్యం చూపుతోంది. గత ప్రభుత్వ హయాంలో అందిన ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు నిలిచిపోయాయి. ఊళ్లకు వైద్యులు, 104 వాహనాలు వెళ్లడం లేదు. దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు గత ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దే వైద్యం అందించేవారు. ఇప్పుడు వారి గురించి పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. దీంతో దూరంగా ఉన్న ఆస్పత్రులకు వెళ్లలేక, సకాలంలో వైద్యం అందక వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాల్లో విలేజ్‌హెల్త్ క్లినిక్‌లు సైతం నిర్వీర్యం అయ్యాయి.





మధ్యలో నిలిచిన మెడికల్ కళాశాల

ఏడాది పాలన
అంతులేని వేదన



మెడికల్ కళాశాల నమూనా

- ఏడాదిలో దిగజారిన వైద్యసేవలు
- ప్రభుత్వ వైద్య కళాశాలలకు బ్రేక్
- ప్రైవేటుపరం కానున్న వైద్య విద్య
- ఆగిన ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు
- పల్లెలకు వెళ్లని 104 వాహనాలు
- గ్రామీణులకు అందని వైద్య సేవలు

నర్సీపట్నం: పేదలు, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య, సేవలు అందించేందుకు గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ కళాశాలల నిర్మాణానికి పెద్దపీట వేశారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అభ్యర్థన మేరకు జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నం నియోజకవర్గానికి మెడికల్ కళాశాలను కేటాయించడమే కాకుండా స్వయంగా కళాశాల పనులకు శంకుస్థాపన చేశారు. అనకాపల్లి జిల్లాకు సంబంధించి నర్సీపట్నం నియోజకవర్గంలోని మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సగం పనులు పూర్తయ్యాయి. జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంతో వైద్య విద్యతో పాటు అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్న గ్రామీణ ప్రజల ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు జల్లింది. మెడికల్ కళాశాలల నిర్వహణను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం యత్నిస్తోంది.

ప్రభుత్వ నిర్ణయం పేద విద్యార్థులు, పేదలకు శాపంగా మారనుంది. ప్రజలకు ఎంతో ఉపయోగపడే మెడికల్ కళాశాల నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది.

భీమబోయిపాలెంలో 52.15 ఎకరాల్లో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టారు. ఏపీ వైద్య సేవల మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ(ఏపీఎంఎస్ఐడీసీ) ఇంజినీర్ల పర్యవేక్షణలో నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులు చేపట్టింది. 12 నెలల్లో మెడికల్ కళాశాలను అందుబాటులోకి తెచ్చేందుకు రాత్రింబవళ్లు నిర్మాణ పనులు చేశారు. 630 పడకలు ఏర్పాటు చేయడానికి, 150 మంది విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించడానికి వీలుగా మెడికల్ కళాశాల నిర్మాణ పనులు చేపట్టారు. మెడికల్ కళాశాల నిర్మాణంతో విశాఖ కేజీహెచ్‌కు వెళ్లే బాధ తప్పుతుందని గ్రామీణ ప్రజలు సంతోషించారు. ప్రభుత్వం మారడంతో మెడికల్ కళాశాలకు గ్రహణం పట్టింది. ప్రజల ఆశలు ఆడియాసలయ్యాయి.



నాడు-నేడులో నిర్మించిన నాతవరం పీహెచ్‌సీ

కళాశాలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం



మెడికల్ కళాశాల నిర్మాణంతో నాణ్యమైన వైద్యం అందుతుందని భావించాం. కళాశాల నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. వైద్య విద్య, కార్పొరేట్ స్థాయి సేవలను పేదలకు చేరువ చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటే, కూటమి నేతలు కార్పొరేట్‌కు ధారదత్తం చేయాలని భావించడం సరికాదు.

– గీతా కృష్ణ, విద్యార్థి సంఘ నాయకుడు, నర్సీపట్నం

వైద్యులు రావడం లేదు



గత ప్రభుత్వంలో వైద్యులు ఇంటి వద్దకే వచ్చి బీపీ, సుగర్‌తో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి, మందులు ఇచ్చేవారు. డాక్టర్లు రెండుసార్లు ఇంటికి వచ్చి చూసేవారు. కొత్త ప్రభుత్వం వచ్చాక వైద్యసిబ్బంది, డాక్టర్లు ఎవరూ రావడం లేదు.

– షేక్ రోజా, పెదబొడ్డేపల్లి

పడకేసిన పల్లె వైద్యం..



విలేజ్ క్లినిక్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసింది. జిల్లాలో సుమారు రూ.65 కోట్ల వ్యయంతో 424 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. పీహెచ్‌సీలకు ఇద్దరు వైద్యుల చొప్పున నియమించింది. వైద్యసిబ్బంది పోస్టులను సైతం భర్తీ చేసింది. పూర్తిస్థాయిలో వైద్యసిబ్బంది నియామకంతో ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరాలు, జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు విజయవంతంగా నిర్వహించారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా 46 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 9 అర్బన్ పీహెచ్‌సీలను అభివృద్ధి చేయడంతో పాటు వైద్యసిబ్బందిని భర్తీ చేసి మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టింది. ఫ్యామిలీ ఫిజీషియన్, జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాల ద్వారా గ్రామీణులకు ఇంటి వద్దే వైద్యసేవలు అందించింది. అందుకనుగుణంగా ఆ ఐదేళ్లలో ప్రజారోగ్యం తమ బాధ్యతగా ఆరోగ్య సిబ్బంది ప్రతి ఊరుకు, ప్రతి గడపకు వెళ్లి వైద్య సేవలు అందించారు.ఎంతో ముందుచూపుతో ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఇద్దరు వైద్యులను నియమించింది. వారిలో ఒకరు ఆస్పత్రిలో మరొకరు 104 వాహనంలో ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందించేవారు.

పల్లెల్లో అసాంక్రమిక వ్యాధులకు క్రమం తప్పకుండా నిర్ధారణ పరీక్షలు చేస్తూ మందులు ఇచ్చేవారు. చాపకిందనీరులా విస్తరిస్తున్న బీపీ, సుగర్, థైరాయిడ్ వ్యాధులను అరికట్టేందుకు గతంలో ఏఎన్ఎం, ఆశావర్కర్ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లె వైద్యం పడకేసింది. ఇప్పుడు వైద్యులు పల్లెలకు వచ్చే పరిస్థితి లేదు. గ్రామాలకు వైద్యులకు ఉన్న సంబంధం పూర్తిగా తెగిపోయింది. గతంలో వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పల్లెలో తిరిగే వారు. నేడు వారు ఎక్కడ ఉన్నారో కూడా తెలియని పరిస్థితి. డయేరియా, జ్వరాలు విజృంభిస్తున్నా పట్టించుకునే వారే లేరు. పల్లెల్లో ఎవరికి ఎలాంటి జబ్బు చేసినా పలకరించే దిక్కు లేదు. జ్వరం వస్తే మంచానికే పరిమితం కావాలి. ప్రజారోగ్యం గాలిలో దీపం చందంగా మారింది. గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు కరువయ్యాయి. గతంలో 104 వాహనాలు నిర్ణీత కాల వ్యవధిలో గ్రామాలకు వెళ్లి మంచానికే పరిమితమైన వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు అందించి అవసరమైన మందులు ఇచ్చేవి. నేడు ఆ వాహనాలు పల్లెల్లో కనిపించడం లేదని ప్రజలు చెబుతున్నారు

తారస్థాయిలో పైరవీలు

- నేటితో ముగియనున్న ఉద్యోగుల బదిలీల ప్రక్రియ
- కూటమి ఎమ్మెల్యేల నుంచి భారీగా సిఫార్సు లేఖలు
- పోస్టును బట్టి ధర నిర్ణయించినట్టు ప్రచారం

మహారాణిపేట(విశాఖ) : ఉద్యోగుల బదిలీలకు గడువు సోమవారంతో ముగియనుండడంతో పైరవీలు తారస్థాయికి చేరుకున్నాయి. రెండు చేతులా డబ్బులు వచ్చే స్థానాల కోసం ఉద్యోగులు కూటమి ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో పోస్టును బట్టి, మండలం/జిల్లాను బట్టి రేట్లు నిర్ణయించి బేరసారాలకు దిగుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సిఫార్సు లేఖల జారీకి ముందు ధరలు నిర్ణయించారని ప్రచారం జరుగుతోంది.

కీలక పోస్టులకు డిమాండ్

ప్రధానంగా తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ఇంజినీర్ల పోస్టులకు సిఫార్సు లేఖల కోసం తీవ్ర పోటీ నెలకొంది. భీమిలి, విశాఖ రూరల్, ఆనందపురం, పెందుర్తి, సీతమ్మధార తహసీల్దార్ పోస్టులకు మంచి గిరాకీ ఉందని, ఈ స్థానాల కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. విశాఖలో ఏళ్ల తరబడి తిష్ట వేసిన వారు ఇక్కడి నుంచి కదలకుండా, గ్రామీణ ప్రాంతాల వారు నగరంలో పోస్టింగ్ కోసం ప్రయత్నిస్తున్నారు.

పాలనాపరమైన ప్రయత్నాలు

ఇటీవల ఉమ్మడి విశాఖ జిల్లాల కలెక్టర్ల సమావేశంలో తహసీల్దార్ల బదిలీలపై ప్రధానంగా చర్చించారు. విశాఖలో పనిచేస్తున్న వారిని ఏజెన్సీకి, అక్కడ పని చేస్తున్న వారిని విశాఖకు బదిలీ చేసే ప్రతిపాదనలు పరిశీలించారు. అలాగే కొందరు విశాఖ తహసీల్దార్లను ఇతర ప్రాంతాలకు పంపాలని విశాఖ కలెక్టర్ యోచిస్తున్నట్లు సమాచారం.

సిఫార్సు లేఖల వెల్లువ

రెవెన్యూ శాఖలో అన్ని కేడర్ల బదిలీల కోసం కూటమి ఎమ్మెల్యేల నుంచి 132 సిఫార్సు లేఖలు కలెక్టరేట్‌కు అందినట్లు తెలుస్తోంది. జిల్లా పరిషత్‌లో ఎంపీడీవోలు, ఇతర ఉద్యోగుల బదిలీలకు కూడా లేఖలు అందాయి. మొత్తం 68 వ్యక్తిగత దరఖాస్తులు కూడా రాగా, మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి సిఫార్సులు, ఫోన్ కాల్స్ పెద్ద సంఖ్యలో వస్తున్నట్లు సమాచారం. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పని చేస్తున్న తహసీల్దార్లు కూడా విశాఖలో పోస్టింగ్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

తపాలా బీమా ఏజెంట్ల నియామకానికి ఇంటర్వ్యూలు నేడు

యలమంచిలి రూరల్: అనకాపల్లి పోస్టల్ డివిజన్ పరిధిలో తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా ఏజెంట్ల డైరెక్ట్ నియామకానికి ఈ నెల 9వ తేదీ సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు డివిజన్ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ సంజయ్ కుమార్ పాండా ఆదివారం 'సాక్షి'కి తెలిపారు. పదో తరగతి కనీస విద్యార్హత కలిగి 18 నుంచి 65 ఏళ్ల లోపు వయస్సు ఉన్న నిరుద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్నవారు, పూర్వ బీమా ఏజెంట్లు(ఏదైనా బీమా సంస్థలో సంస్థలో పనిచేసిన వారు), విశ్రాంత ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు, మాజీ సైనికోద్యోగులు, ఆసక్తి కలిగిన వారెవరైనా బీమా ఏజెంట్లుగా చేరడానికి అర్హులని చెప్పారు. ఎంపికైన వారిని ప్రాథమికంగా 12 నెలల కాలపరిమితికి బీమా ఏజెంట్లుగా నియమించి ఐడీ కార్డు, ఏజెంట్ కోడ్‌తో లైసెన్స్ జారీ చేస్తారు. కొత్తగా నియమితులైన తపాలా ఏజెంట్లకు మూడు రోజుల శిక్షణ ఇస్తారు. అనకాపల్లి ప్రధాన తపాలా కార్యాలయంలో సోమవారం జరిగే ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డు ఒరిజినల్ జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు. ఇంటర్వ్యూలో బీమా ఏజెంట్లుగా ఎంపికైన వారు రూ.5 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ఆ మొత్తానికి సరిపడా నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ బాండ్‌ను ఏజెంట్ పేరున జారీ చేస్తామని ఆయన తెలిపారు.

రైస్ మిల్లుల తనిఖీ



రైస్ మిల్లులో స్టాక్‌ను పరిశీలిస్తున్న డీఎస్‌వో మూర్తి, అధికారులు

చోడవరం: పీడీఎస్ బియ్యం కొనుగోలు, అమ్మకాలు చేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె.వి.ఎల్.ఎస్. మూర్తి హెచ్చరించారు. మండలంలో వెంకన్నపాలెం, ముద్దుర్తి గ్రామాల్లో రైస్ మిల్లులను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులు పరిశీలించి, ధాన్యం, బియ్యం నిల్వల శాంపిల్స్‌ను తీసి పరీక్షలకు పంపారు. చౌక ధరల దుకాణాల ద్వారా పేదలకు ఇచ్చే బియ్యాన్ని రైస్ మిల్లర్లు కొనుగోలు, అమ్మకాలు చేయరాదని, అటువంటివి జరిగినట్టు తమ పరిశీలనలో తేలితే కేసులు పెడతామని డీఎస్‌వో హెచ్చరించారు. అనంతరం గత ఖరీఫ్, రబీ సీజన్లలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలుపై ఆరా తీసి, రికార్డులను పరిశీలించారు. బియ్యం ఎగుమతుల రికార్డులను పూర్తిస్థాయిలో నిర్వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులు పాల్గొన్నారు.

11న ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె నోటీస్

అనకాపల్లి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా 1-2019 సర్క్యులర్ అమలు చేయని కారణంగా ఆర్టీసీ విజయనగరం జోనల్ స్థాయి పరిధిలో గల ఆరు జిల్లాల కలెక్టర్లకు ఈ నెల 11న సమ్మె నోటీసు అందజేయనున్నట్టు ఎన్ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు తెలిపారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జోనల్ పరిధిలో ఆరు జిల్లాల రీజనల్ కమిటీలు ఆయా కలెక్టర్లకు సమ్మె నోటీసులు అందజేయనున్నట్టు తెలిపారు. ఇక్కడి డిపో ఎదుట వంద రోజుల నుంచి రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా, ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడం బాధాకరమన్నారు. సమ్మె నోటీసులు ఇస్తున్న నేపథ్యంలో నిరాహార దీక్షను ఆదివారం విరమించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పి. సుధాకర్, విజయనగరం రీజనల్ కార్యదర్శి పి.జి. రాఫిల్, యూనియన్ నాయకులు ఎం.వి.ఆర్.మూర్తి, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ టోల్ ఫ్రీ నంబర్1100

తుమ్మపాల: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)కార్యక్రమానికి సంబంధించి ఫిర్యాదులను ప్రభుత్వ కార్యాలయాలతో పాటు టోల్ ఫ్రీ నంబర్‌కు 1100కు కూడా ఫోన్ చేసి నమోదు చేయవచ్చని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదుల స్థితిగతులను కూడా టోల్ ఫ్రీ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమాలు ప్రతి సోమవారం యథావిధిగా కలెక్టరేట్, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మండల కార్యాలయాల్లో కొనసాగుతాయని పేర్కొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం

- పలు చోట్ల నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు



శంకరం కళ్లాల వద్ద నేలకొరిగిన విద్యుత్ స్తంభం



మాడుగుల-ఎం.కోడూరు రహదారిలో పిరమిడ్ కేంద్రం వద్ద పడిపోయిన మినీ ట్రాన్స్‌ఫార్మర్



మాడుగుల చెక్‌పోస్టు వద్ద మెయిన్‌రోడ్‌లో నేల కొరిగిన చెట్లు



మాడుగుల నిర్మలా కాలనీలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

మాడుగుల రూరల్/మాడుగుల: మండలంలో ఆదివారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఈదురుగాలు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గరికిబంద చెక్‌పోస్టు వద్ద భారీ వృక్షాలు నేల కొరగడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి చెట్లను తొలగించకపోవడంతో ప్రయాణికులు సుమారు మూడు గంటలు పాటు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మాడుగుల నుంచి ఎం.కోడూరు వెళ్లే రహదారిలో పిరమిడ్ ధ్యాన కేంద్రం వద్ద మినీట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగింది. తాటిపర్తి పంచాయతీ శివారు చిన కూర్మానాథపురం, శంకరం, జేడీపేట పంచాయతీ శివారు కొండలపాడు, ఎం.కోడూరులలో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, ఎం.కోడూరు, సాగరం తదితర చోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. పక్వానికి వచ్చిన మామిడి కాయలు పూర్తిగా రాలిపోయి రైతులు నష్టపోయారు. ఎం.కోడూరు, మాడుగులలో సమారు 13 స్తంభాలు విరిగిపోయాయని, తమ సిబ్బంది పునరుద్ధరణ చర్యలు చేపట్టారని విద్యుత్ శాఖ ఏఈ ఎం. రాంబాబు తెలిపారు.

హెచ్‌ఎంలు, ఎంఈవోలకు పదోన్నతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ

అనకాపల్లి: విద్యా శాఖలో హెచ్‌ఎంలు, ఎంఈవోలకు పదోన్నతులు కల్పించాలని ఏపీ హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరమణ డిమాండ్ చేశారు. స్థానిక న్యూకాలనీ రోటరీ హాల్లో ఆదివారం సంఘం జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా ప్రమాణాల మెరుగుతో పాటు పర్యవేక్షణ పెంచడం కోసం తక్షణమే ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలను ఎంఈవోలుగా, ఎంఈవోలను డిప్యూటీ డీఈవోలుగా పదోన్నతులు కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్లస్టర్ హైస్కూల్స్ హెడ్ మాస్టర్ పోస్టులను గ్రేడ్-ఐహెచ్‌ఎం పోస్ట్‌గా అప్ గ్రేడ్ చేసి ప్రమోషన్ ఇవ్వాలన్నారు. ఉమ్మడి సర్వీసు రూల్స్ తయారు చేసి పదోన్నతి కల్పించాలన్నారు. ప్రధానోపాధ్యాయులకు పనిభారం తగ్గించాలని, అధికారులు ర్యాంకుల కోసం పరుగులు పెడుతూ, సొంత అజెండాలతో విపరీతమైన ఒత్తిడి పెంచుతున్నారని చెప్పారు. దీంతో ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి లోనై అనారోగ్యానికి గురవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇతర శాఖలలో రికార్డు అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరిన వారు డీఈవోలు, ఆర్‌జేడీలుగా రిటైర్ అవుతున్నారని, 16 నుంచి 20 సంవత్సరాలు సర్వీస్ చేసిన హెచ్‌ఎంలు, ఎంఈవోలుగా ప్రమోషన్ లేకుండా పదవీ విరమణ చేయడం దారుణమన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెలమల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పింఛన్‌దారుల కోసం వెంటనే వేతన సవరణ సంఘం(పీఆర్సీ) కమిటీ నియమించి ఇంటీరియర్ రిలీఫ్(ఐఆర్)ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి సి.వి.వి. సత్యనారాయణ, సభ్యులు కె.సత్యనారాయణ, సిహెచ్.రవి, వి.నూకరాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఎ.వి.హెచ్.శాస్త్రి, కార్యదర్శి ఎం.జె.రవీంద్రబాబు, జిల్లా నాయకులు కోడి శ్రీనివాసరావు, వరాహమూర్తి, శేషగిరిరావు, శ్రీరామమూర్తి, రామస్వామినాయుడు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అంధ మహిళా క్రికెట్ క్రీడాకారులకు ప్రోత్సాహం



క్రికెట్ పోటీల ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సుప్రీం కోర్టు న్యాయవాది శరత్‌బాబు

ఉక్కునగరం: ఎన్టీపీసీ సింహాద్రి సహకారంతో క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఆంధ్రప్రదేశ్, క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ కేరళ సంయుక్త ఆధ్వర్యంలో ఉక్కు స్టేడియంలో అంతర్ రాష్ట్ర అంధ మహిళల క్రికెట్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ అంధ మహిళా క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్ఘాటించారు. క్రీడాకారులకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న సుప్రీంకోర్టు అడ్వకేట్ శరత్‌బాబు, తన వంతుగా విజేత జట్టుకు రూ. 75 వేలు, రన్నరప్ జట్టుకు రూ. 25 వేలు బహుమతులుగా అందజేస్తానని ప్రకటించి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. పోటీలలో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు, కేరళ జట్టుపై 79 పరుగుల తేడాతో విజయం సాధించింది. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో ఒడిశా జట్టు, ఢిల్లీ జట్టును 49 పరుగుల తేడాతో ఓడించి గెలుపొందింది. కార్యక్రమంలో విజువల్లి ఛాలెంజ్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. రవీంద్రబాబు, ఎన్టీపీసీ సింహాద్రి యూనిట్ ప్రతినిధి అనిల్, ఇండియన్ బ్లైండ్ క్రికెట్ మాజీ కెప్టెన్ అజయ్ కుమార్ రెడ్డి, కోఆర్డినేటర్లు అమ్మినాయుడు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి గ్రావెల్ అక్రమ రవాణా



అర్ధరాత్రి ట్రాక్టర్‌తో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం రూరల్ : మండలంలో ఆదివారం అర్ధరాత్రి గ్రావెల్ దొంగలు రెచ్చిపోయారు. కొండకర్ల, చీమలాపల్లికి మధ్యలో ఉన్న కొండ ప్రాంతాన్ని అర్ధరాత్రి వేళ అక్రమార్కులు యథేచ్ఛగా దోచేస్తున్నారు. నిర్మాణాలకు, ఖాళీ స్థలాల్లో నింపేందుకు ఉపయోగకరమైన మట్టిని దర్జాగా కొండల్ని పిండిచేసి తరలించుకుపోతున్నారు. స్థానికంగా ఉన్నవారు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా ఫలితం లేకపోతోంది. సుమారు 10 ట్రాక్టర్లతో మట్టిని ఇక్కడి కొండ ప్రాంతాన్ని తవ్వి తరలించుకుపోయారు. ఈ దందా కూటమి నాయకుల కనుసన్నల్లో జరుగుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రావెల్ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా వాణి

మహారాణిపేట: కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఐ.వాణి నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇటీవల వైద్యారోగ్యశాఖలో అడిషనల్ డీఎంఈగా పదోన్నతి పొందిన వాణి.. ప్రస్తుతం కేజీహెచ్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా, గైనిక్ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు సూపరింటెండెంట్‌గా పనిచేసిన శివానంద్ 16 నెలల పాటు ఈ పదవిలో ఉన్నారు.

• ఆసనం..ఆరోగ్యం



నగరంలోని పోర్టు స్టేడియంలో యోగాంధ్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు వెయ్యి మందికి పైగా నగర ప్రజలు ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల ఆసనాలను వేశారు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖ

• సర్ఫింగ్ అదరహో



నగరంలోని తెన్నేటి పార్కు బీచ్‌లో ఓ యువకుడు తన సర్ఫింగ్ విన్యాసాలతో సందడి చేశాడు. అలలపై నైపుణ్యంగా దూకుతూ, గంతులు వేస్తూ పర్యాటకుల దృష్టిని ఆకర్షించాడు. అతని సాహసోపేత విన్యాసాలు బీచ్‌కు వచ్చిన వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి.

'మధ్యాహ్న' భోజన నిర్వాహకుల ఆకలి కేకలు



పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

నాతవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వండి పెడుతున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు గౌరవ వేతనం అందక నానా అవస్థలు పడుతున్నారు. నిర్వాహకులతో పాటు ఆయాలు నైట్ వాచ్‌మెన్లలకు మార్చి నుంచి గౌరవ వేతనాలు మంజూరు కాలేదు. జిల్లాలో అన్ని పాఠశాలలను కలుపుకొని మొత్తం 2,641 మంది మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్నారు. వీరికి ప్రభుత్వం మార్చి, ఏప్రిల్‌కు సంబంధించి ఆహార పదార్థాల సామగ్రి బిల్లులు ఇంత వరకు చెల్లించలేదు. అలాగే నిర్వాహకులకు రూ.3 వేలు చొప్పున రెండు నెలలకు సంబంధించి రూ.6 వేలు గౌరవ వేతనం కూడా అందలేదు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో ఆయాలు 1,551 మంది పని చేస్తున్నారు. వీరికి మార్చి నుంచి గౌరవ వేతనం కూటమి ప్రభుత్వం చెల్లించలేదు. జిల్లాలోని హైస్కూళ్లలో 204 మంది నైట్ వాచ్‌మెన్లు పని చేస్తున్నారు. వీరికి రూ.6 వేలు చొప్పున మార్చి నుంచి మే నెల మూడు నెలలకు రూ.18 వేలు చెల్లించాలి. గత విద్యా సంవత్సరానికి సంబంధించి మధ్యాహ్న భోజన పథకం బిల్లులు, నిర్వాహకులు, ఆయాలు, నైట్‌వాచ్‌మెన్లకు గౌరవ వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి తమ ఆకలి సమస్య తీర్చాలంటూ వేడుకుంటున్నారు. ఈ విషయంపై నాతవరం ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబును వివరణ కోరగా.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సకాలంలో బిల్లులు ఆన్‌లైన్‌లో తయారు చేసి పంపించామన్నారు. ప్రభుత్వం నేరుగా బ్యాంకు అకౌంట్లలోనే గౌరవ వేతనం వేస్తుందని, ఈ సమస్య ఉన్నతాధికారులు దృష్టిలో ఉందన్నారు.

సంఘాల నిర్మాణంతో పాటు ఉద్యమాన్ని విస్తరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం

దాబాగార్డెన్స్: దాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యల రెండు సంస్థల విలీన సభ సందర్భంగా సాహిత్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ, గత 50 ఏళ్లుగా విప్లవ సాంస్కృతికోద్యమ నిర్మాణంలో భాగమైన రెండు సంఘాల విలీనం అవసరమన్నారు. మార్క్సిజం, లెనినిజం, మావోయిజం భావాలున్న వారు ఐక్యమవ్వాల్సిన అవసరం ఉందని, రాజకీయ కార్యాచరణ ద్వారానే ఇది సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో కార్పొరేట్ మనువాదం, సామ్రాజ్యవాదం పెరిగిపోతున్నాయని, మోదీ ప్రభుత్వం ప్రశ్నించే వారిని అణచివేస్తోందని ప్రొఫెసర్ కాశీం విమర్శించారు. ఇటువంటి తరుణంలో కళాకారులు ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత ఉందని, ఆ దిశగా అరుణోదయ కళాకారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకోవాలని, మందసలో ఎయిర్‌పోర్టు రాకుండా రైతుల భూములను రక్షించాలని కోరారు. తెలంగాణ అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు వేణు మాట్లాడుతూ, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కనబెట్టి మోదీ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. సభాధ్యక్షుడు నాగరాజు అమర కళావీరులను స్మరిస్తూ తీర్మానం చేశారు. ముందుగా సరస్వతి పార్క్ నుంచి సభావేదిక వరకు అరుణోదయ కళాకారుల కళా ప్రదర్శన ఆటపాటలతో సాగింది. కార్యక్రమంలో తెలంగాణ అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సున్నశెట్టి రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి అంజయ్య, కె నిర్మల, ఎస్.జయలక్ష్మి, పీడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు ఎం.లక్ష్మి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు వేంకటేశ్వర్లు, న్యాయవాది చలం అధిక సంఖ్యలో కళాకారులు పాల్గొన్నారు.

గుండె చెరువు

చెరువులో స్నానానికి దిగి మృత్యువు పాలైన ముగ్గురు చిన్నారులు తల్లి దండ్రులకు గర్భశోకం మిగిల్చారు. వీరిలో ఇద్దరు అన్నదమ్ముల సంతానం కావడంతో ఆయా కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి. వారిని ఓదార్చడం ఎవరితరం కావడం లేదు. ఈ ఘటనతో మండలంలోని బిల్లాపుట్టు, గంగవలస గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

- ముగ్గురు చిన్నారుల మృతితో గంగవలస, బిల్లాపుట్టులో విషాదం
- స్నానానికి దిగడంతో ప్రమాదం
- మృతుల్లో ఇద్దరు అన్నదమ్ముల సంతానం
- పుట్టెడు దుఃఖంలో బాధిత కుటుంబాలు
- ఆర్థికసాయం అందించి ఆదుకోవాలి: అరకు ఎంపీ తనూజరాణి, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



ముగ్గురు చిన్నారుల మృతదేహాలు



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



బంధువుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

డుంబ్రిగుడ : మండలంలోని పోతంగి పంచాయతీ బిల్లాపుట్టుకు చెందిన అన్నదమ్ములు గుంట కమందన్, గుంట రామదాస్‌కు చెందిన కుమారులు గుంట సాయికిరణ్(14), గుంట భానుతేజ్ (14) వారం రోజుల క్రితం ఇదే మండలంలోని గుంటసీమ పంచాయతీ గంగవలస గ్రామంలోని మేనత్త, మేనమామ ఇంటికి వెళ్లారు. వీళ్ల ఇదే గ్రామానికి చెందిన కొర్ర ధన్యారావు కుమారుడు కొర్ర సుశాంత్‌తో కలిసి ఆదివారం ఉదయం 10 గంటలకు సమీప అటవీ ప్రాంతానికి వెళ్లారు. అక్కడి నుంచి మామిడిపళ్లు తీసుకుని వస్తుండగా మార్గం మధ్యలో జంగమయ్య గుడి పక్కనున్న చెరువులోకి స్నానానికి దిగారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులో 10 నుంచి 12 అడుగుల లోతున నీరు చేరడంతో ముగ్గురు ప్రమాదానికి గురయ్యారు. నీటిలో మునిగిపోయి ప్రాణాలు కోల్పోయారు. వారిని రక్షించేందుకు పరిసర ప్రాంతీయులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ప్రమాద సమాచారం తెలుసుకున్న గుంటసీమ సర్పంచ్ గుమ్మ నాగేశ్వరరావు, స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను బయటకు తీశారు. ఈమేరకు ఎస్ఐ కె.పాపినాయుడు కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అరకు ఏరియా ఆస్పత్రికి అంబులెన్సులో తరలించారు. పాడేరు డీఎస్పీ సహబాజ్ అహ్మద్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

- గుంట కమందన్‌కు సాయికిరణ్‌తోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గుంట బలరామ్‌కు కుమారుడు భానుతేజ్‌తోపాటు కుమార్తె ఉంది. సాయికిరణ్, భానుతేజ్ మృతితో ఈ రెండు కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. మృతులు ముగ్గురు వేర్వేరు పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. సాయికిరణ్ అరకులోయలోని పాఠశాలలో చదువుతుండగా భానుతేజ్ అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని గిరిజన గురుకుల పాఠశాల, కొర్రా సుశాంత్ మండలంలోని గుంటసీమలోని ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాలలోను చదువుతున్నారు.

కూలికి వెళ్తేనే గడిచేది..

చెరువులో మునిగి మృతి చెందిన ముగ్గురు చిన్నారులకు చెందిన కుటుంబాలది దయనీయ పరిస్థితి. రోజు వారీగా కూలీకి వెళ్తేనే తప్ప.. పూట గడవని పరిస్థితి బాధిత తల్లిదండ్రులది. సుశాంత్ తండ్రి వ్యవసాయ కూలీకాగా సాయికిరణ్, భానుతేజ్ తండ్రులు ఓ ప్రైవేటు గ్యాస్ ఏజెన్సీలో కార్మికులుగా పని చేస్తున్నారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ తల్లిదండ్రులకు చిన్నారులను చెరువు రూపంలో మృత్యువు దూరం చేసి తీరని దుఃఖాన్ని మిగిల్చింది.

ప్రభుత్వం ఆదుకోవాలి

చెరువులో స్నానానికి దిగి మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని ఎంపీ తనూజరాణి, అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఢిల్లీలో ఉన్న ఎంపీని బాధిత కుటుంబీకులతో సర్పంచ్ నాగేశ్వరరావు ఫోన్లో మాట్లాడించారు. అనంతరం ఆమె అరకు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. పోస్టుమార్టం త్వరగా పూర్తి చేసిన చిన్నారుల మృతదేహాలను అంబులెన్సులో వారి స్వగ్రామాలకు తరలించాలని ఎంపీ ఆదేశించారు.

క్లుప్తంగా

ఆలయ మండపం పనులు ప్రారంభం



ఆలయ శ్లాబ్ పనులకు భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో గౌరీ పరమేశ్వరుల ఆలయ మండపం శ్లాబ్ పనులకు ఆదివారం గ్రామస్తులు భూమిపూజ చేశారు. గతంలో ఆలయం శిథిలమైంది. దాంతో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా శ్లాబ్ పనులను ప్రారంభించారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, పెద్దలు మళ్ల వరహా నరసింగరావు, పెతకంశెట్టి రామజోగినాయుడు, రాజేష్, నూకప్పారావు, శివాజీ, మోహన్, సన్యాశినాయుడు, బాలాజీ, అప్పారావు, గౌరీ యూత్ సభ్యులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

యాంత్రీకరణ సాగు లాభదాయకం

రావికమతం: ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం కావాలని కొండేంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజ్‌కుమార్ కోరారు. యాంత్రీకరణతో వ్యవసాయం చేపట్టడం ద్వారా పని వేగం కావడంతో పాటు ఖర్చు తగ్గుతుందన్నారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం చినపాచిలి గ్రామంలో జిల్లా వ్యవసాయ శాఖ సహకారంతో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు సంబంధించిన సలహాలు, సూచనలను శాస్త్రవేత్తల ద్వారా రైతుల కందించే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల ఏవో రూప మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ఏ పంటలు వేసుకోవాలో వివరించారు.

10, 11 తేదీల్లో పల్లె నిద్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్: పల్లెలో సమస్యల పరిష్కారానికి ఈ నెల 10,11 తేదీల్లో కశింకోట మండలం సోమవరంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక రింగ్‌రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉదయం యోగాభ్యాసంతో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అనంతరం గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు తగిన కార్యక్రమాల రూపకల్పన చేస్తామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం, పథకాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

మల్లంపాలెంలో శ్రమదానం



ఆలయం పరిసరాలను శుభ్రం చేస్తున్న గ్రామస్తులు

కె.కోటపాడు : మల్లంపాలెంలోని పెద పైడిమాంబ, శ్మశానవాటికలో ఆదివారం గ్రామస్తులు శ్రమదానం చేశారు. వార్డు మెంబర్ వంటాకు గోవిందరావు, మహిళలు, యువకులు ఆయా పరిసరాల్లో పెరిగిపోయిన పిచ్చి మొక్కలు తొలగించారు. చెత్తను ఊడ్చి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	: భైరవం
సత్యనారాయణ స్క్రీన్-1	: గ్యాంబ్లర్స్
సత్యనారాయణ స్క్రీన్-2	: 007
పర్తిసాయి	:ఖలేజా
షిర్డీసాయి	: థగ్ లైఫ్
వెంకటేశ్వర	:రాజావారు
శ్రీ సత్య	:శుభం
రామచంద్ర	: పాడేరు 12వ మైలు

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 49 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-15 యూనిట్లు, బీ పాజిటివ్-6, ఓ పాజిటివ్-23, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 289 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 232 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

అడుగుకో గుంత..

గోతులమయంగా జోగారావుపేట-గణపర్తి రోడ్డు

ఇటీవల వర్షాలకు రాకపోకలకు ఇక్కట్లు

పట్టించుకోని కూటమి ప్రభుత్వం



రాకపోకలకు నరకయాతన పడుతున్న రైతులు



అధ్వానంగా జోగారావుపేట-గణపర్తి రోడ్డు

కశింకోట: సంక్రాంతిలోగా గుంతలు లేని రోడ్లు చేస్తామని, ఉగాది కల్లా బాగు చేస్తామని బీరాలు పలికిన కూటమి నాయకులు ఇప్పటికీ అటువైపు కన్నెత్తి చూడటం లేదు. మండలంలో పేరంటాలపాలెం శివారు జోగారావుపేట నుంచి గణపర్తి రహదారిలో అడుగుకో గుంత దర్శనమిస్తోంది. అడుగు వేస్తే తీయలేని పరిస్థితి నెలకొంది. ప్రజలు, రైతులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు.

మండలానికి శివారు జోగారావుపేటలో 800 మంది జనాభా ఉంది. వ్యవసాయం, పశు పోషణ జీవనాధారం. విద్యార్థులు పక్కనే ఉన్న మునగపాక మండలం గణపర్తిలోని హైస్కూలుకు చదువుకోవడానికి వెళ్లి వస్తుంటారు. అచ్యుతాపురం వద్ద బ్రాండెక్స్, ఇతర పరిశ్రమల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికులు మునగపాక మండలం చూచుకొండ మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. జోగారావుపేట నుంచి గణపర్తి వరకు ఒక వైపు రెండు కిలోమీటర్ల పొడవున పొలాల మధ్యగా రోడ్డు ఉంది. జోగారావుపేటతోపాటు చూచుకొండ, గణపర్తి గ్రామాలకు చెందిన రైతుల పొలాలు, పశువుల శాలలు ఈ మార్గంలోనే ఉన్నాయి. దీంతో తమ వ్యవసాయ కార్యకలాపాలు సాగించుకోవడానికి, పాలు సేకరణ, పశువుల సంరక్షణకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారి మెటల్, మట్టితో నిండి ఉండటం వల్ల గోతులు పడి రాకపోకలు సాగించడానికి వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది చెందుతున్నారు.

ఏ మాత్రం చిన్నపాటి వర్షం పడినా..

ఏ మాత్రం చిన్నపాటి వర్షం పడినా బురదమయంగా మారి దిగబడిపోయి నడవడానికి నరకయాతన పడాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు అయితే రాకపోకలు సాగించడం గగనంగా మారుతోంది. చెరకు క్రషర్ల వద్ద తయారైన బెల్లం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు, ఎరువులు వగైరా తరలించడానికి అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు. ఇటువంటి పరిస్థితిలో ఇక్కడ తారురోడ్డు నిర్మించాలని చాలా కాలంగా ఈ ప్రాంత ప్రజలు, రైతులు కోరుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అనకాపల్లి వైపు రోడ్డు నిర్మించినప్పటికి మరో వైపు ఉన్న ఈ రోడ్డు నిర్మాణానికి మాత్రం ప్రయత్నించినా పనులు జరగలేదు.

గత ప్రభుత్వంలో రోడ్డు పనులు..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి రూ.1.80 కోట్లు పంచాయతీ, ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేయించడంతో రోడ్డు పని చేపట్టారు. దీంతో ఇరుకురోడ్డును మట్టి, మెటల్ వేసి వెడల్పు చేశారు. ఈ సమయంలో కొందరు రైతులు తమ భూములు రోడ్డులో పోతున్నాయంటూ అభ్యంతరం తెలిపారు. దీంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం రైతులకు నచ్చజెప్పి పనులు పునః ప్రారంభించడానికి ప్రయత్నించేలోగా సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు ముందుకు సాగలేదు.

చొరవ చూపిన కూటమి పాలకులు

తాజాగా కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా రోడ్డు నిర్మాణం గురించి పట్టించుకోలేదు. దీంతో ఎప్పటిలాగే రైతులు, ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఏడాది ముందుగా వేసవిలోనే వర్షాలు మొదలై కురుస్తుండటంతో ఇక రోడ్డు గోతుల్లో నీరు నిల్వ ఉండిపోయి రాకపోకలు సాగించాలంటే నరకాన్ని చవి చూడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల పల్లపు సోమవరం గ్రామానికి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను గణపర్తికి చెందిన రైతులు మారిశెట్టి వెంకటరమణ, తదితరులు కలిసి జోగారావుపేట రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఇకనైనా రోడ్డు నిర్మాణం చేపట్టి తమ కష్టాలు తీర్చాలని ఈ ప్రాంత ప్రజలు, రైతులు కోరుతున్నారు.



పశుగ్రాసం తేవడానికి రైతులు పడుతున్న తిప్పలు

నరకయాతన పడుతున్నాం



జోగారావుపేట-గణపర్తి మధ్య రోడ్డు చాలా అధ్వానంగా ఉంది. సాధారణ రోజుల్లోనే రాకపోకలకు కష్టంగా ఉంది. ఇక ఏ మాత్రం వర్షం పడినా నరకయాతన పడాల్సి వస్తోంది. తారు రోడ్డును తక్షణమే నిర్మించడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

– జోగా సత్తిబాబు, జోగారావుపేట

అష్టకష్టాలు తప్పడం లేదు



మా పొలాలు, పశుశాలలు జోగారావుపేట రోడ్డులో ఉన్నాయి. అక్కడికి వెళ్లి రావడానికి రోడ్డు బాగుండక అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. వ్యవసాయ ఉత్పత్తులు, పశుగ్రాసం తెచ్చుకోవడానికి నానా యాతన పడుతున్నాం. ఏళ్ల తరబడి రోడ్డు అధ్వానంగా ఉన్నా, ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్డు నిర్మించడానికి చర్యలు తీసుకోవాలి.

– కాండ్రేగుల శ్రీనివాసరావు, రైతు, చూచుకొండ

రోడ్డు బాగు చేస్తే తప్పనున్న కష్టాలు



జోగారావుపేట రోడ్డులో కౌలుకు భూములు తీసుకొని సాగు చేస్తున్నాను. రోడ్డు బాగోకపోవడం వల్ల పంట పండించుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. గత్యంతరం లేక అష్టకష్టాలు పడి సాగు చేసుకోవాల్సి వస్తోంది. రోడ్డు బాగు చేస్తే కష్టాలు తప్పుతాయి.

– చదరం రాము, రైతు, గణపర్తి

ఎమ్మెల్యేకు విన్నవించాం



జోగారావుపేట రోడ్డు దుస్థితిపై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లి ఇటీవల సోమవరం గ్రామం వద్ద కలిసి వినతి పత్రాన్ని అందజేశాం. ఆయన సానుకూలంగా స్పందించారు.

– మారిశెట్టి వెంకట రమణ, రైతు, గణపర్తి

మానవతా విలువలతో జీవించాలి



వైద్యుడు నాయుడ్ని శాలువాతో సత్కరిస్తున్న వాకర్స్ సభ్యులు

అనకాపల్లి: నేటి సమాజంలో ప్రతి వ్యక్తి మానవతా విలువలతో జీవించేందుకు కృషి చేయాలని వాకర్స్ క్లబ్ సీనియర్ నాయకుడు, వైద్యుడు డి.డి.నాయుడు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ ఆవరణలో ఎన్టీఆర్ వాకర్స్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్రతి వ్యక్తి రామాయణం, మహాభారతం చదవడం వల్ల అనేక విషయాలు తెలుస్తాయన్నారు. వాకింగ్ చేయడం వల్ల శరీరానికి తగిన శక్తి లభిస్తుందన్నారు. అనంతరం డి.డి.నాయుడ్ని క్లబ్ సభ్యులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షుడు రాపేటి నారాయణరావు, సభ్యులు కె.వి.గౌరీపతి, శరగడం నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గరుడోత్సవం





కశింకోటలో గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు, మహిళల కోలాటాల ప్రదర్శన

కశింకోట: స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో స్వామివారి 8వ కల్యాణోత్సవాలు ముగింపు పురస్కరించుకుని ఆదివారం రాత్రి గరుడోత్సవం (తిరు వీధి సేవ) ఘనంగా నిర్వహించారు. జ్యేష్ట శుద్ధ ఏకాదశి పురస్కరించుకొని శనివారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. రెండో రోజు ఉత్సవ ముగింపులో భాగంగా గరుడ వాహనంపై శ్రీనివాసుని ఉత్సవ విగ్రహాన్ని నిలిపి పూలమాలలతో అందంగా అలంకరించి రథంపై ఊరేగింపు నిర్వహించారు. ఆలయం నుంచి బాణసంచా కాలుస్తూ మహిళల కోలాటాలతో సన్నాయి మేళతాళాలతో సంప్రదాయంగా ప్రారంభమైన ఊరేగింపు పెద బజారు, కోమటి వీధి, కస్పావీధి, పూసర్ల వీధి, సంతబయల మీదుగా సాగి తిరిగి ఆలయానికి చేరుకుంది. ఆ సమయంలో భక్తులు స్వామివారిని దర్శించారు. ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు, తదితరులు కార్యక్రమం నిర్వహించారు.

పిడుగు కాదు.. విద్యుదాఘాతం.!



విద్యుదాఘాతానికి గురై కాలిపోతున్న కొబ్బరి చెట్టు

బుచ్చెయ్యపేట: మేజర్ పంచాయతీ వడ్డాది నేషనల్ టాలెంట్ స్కూల్(ఎన్టీఎస్) దగ్గరలో విద్యుదాఘాతంతో ఓ కొబ్బరిచెట్టు దగ్ధమైంది. ఆదివారం రాత్రి వీచిన గాలులకు విద్యుత్ తీగలు కలిసిపోయి పక్కనున్న కొబ్బరిచెట్టుకు తగిలాయి. షార్ట్ సర్క్యూట్‌తో కొబ్బరి చెట్టుపై మంటలు వ్యాపించాయి. పిడుగు పడ్డ విధంగా చెట్టంతా కాలిపోయింది. పాఠశాల దగ్గరలో విద్యుత్ వైర్లు వేలాడుతూ మంటలు వ్యాపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో వడ్డాది జంక్షన్‌లోనే నివాసం ఉంటున్న ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థి ఇంటిపై ఆడుకుంటూ వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందాడు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను మార్పు చేసి ప్రమాదాలు నివారించాలని పలువురు కోరుతున్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



మండల టాపర్ రమాగాయత్రికి ప్రోత్సాహకం అందిస్తున్న సంఘం ప్రతినిధులు

చోడవరం: బ్రాహ్మణుల సంక్షేమానికి గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఎంతగానో కృషి చేస్తుందని సంఘం అధ్యక్షుడు పుల్రేవు శ్యామ్‌ప్రసాద్ అన్నారు. చోడవరంలో సంఘ సర్వసభ్య సమావేశం సేవా ట్రస్టు గౌరవ అధ్యక్షుడు కందర్ప కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ముందుగా గతేడాది బడ్జెట్‌లో జమా ఖర్చులు, ఈ ఆర్థిక సంవత్సరంలో అంచనా బడ్జెట్‌ను సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన బ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచిన ఆత్రేయపురపు రమా గాయత్రిని, చుండూరు వంశీకృష్ణకి రూ.5వేలు చొప్పున ఆర్థిక ప్రోత్సాహంతో ఘనంగా సత్కరించారు. రెండో స్థానంలో నిలిచిన పేరి ప్రహర్షితకు రూ.3వేలు అందజేశారు. ఈ సందర్భంగా శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వింజమూరి శంకర్, ప్రతినిధులు గోటేటి సీతారామయ్య, వారణాసి రామలింగశాస్త్రి, గుంటూరు సత్యనారాయణ, కందర్ప సత్యనారాయణమూర్తి, ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో యోగా భాగం కావాలి



మాట్లాడుతున్న జిల్లా ఆయుష్ విభాగం అధికారి లావణ్య



యోగాసనాలు చేస్తున్న వృద్ధులు

అనకాపల్లి: ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని జిల్లా ఆయుష్ విభాగం అధికారి డాక్టర్ కె.లావణ్య తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్రలో భాగంగా జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జార్జ్ క్లబ్‌లో యోగాసనాలు నిర్వహించారు. యోగా గురువులు మంగియ్య, దొరమ్మ నాయుడు, బీ అప్పారావు వృద్ధులతో యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ నిత్యం యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను భాగం చేసుకోవడం ద్వారా మానసిక ప్రశాంతతతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించవచ్చన్నారు. వృద్ధులు యోగాసనాలు వేయడం వల్ల ఆరోగ్యవంతంగా జీవిస్తారన్నారు. వయోవృద్ధుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వి.గౌరీపతి మాట్లాడుతూ ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది నెల రోజులు పాటు యోగా దినోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. కరోనా తర్వాత ప్రతి ఒక్కరిలోను యోగాపై ఆసక్తి పెరిగిందన్నారు. కార్యక్రమంలో పి.వీరభద్రరావు, జి.భీమేశ్వరరావు, కె.జగన్నాథరావు, నల్లాల దేముళ్లు, ఎం.ప్రభాకర్, బొట్టా అప్పారావు, బుద్ద వీరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న సమితి ప్రతినిధులు

కశింకోట: త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుని అసలైన జ్ఞాన మార్గాన్ని తెలియజేస్తుందని విశాఖపట్నం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం కశింకోటలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవుడు ఎప్పటికి మారని జీవకులం, దైవ మతంలో ఉన్నారన్న విషయం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అనేక మతాలను సృష్టించుకుని తనది శాశ్వతమైన దైవ మతం, దైవ మార్గమని గ్రహించలేకున్నాడన్నారు. ప్రతి మనిషి అహంతో జీవిస్తూ తాను జీవాత్మనని కూడా గ్రహించడం లేదన్నారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు రమణ, రాజారావు, పద్మ, నాగమణి, దేవి, సర్వధారి, సత్యవతి పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

అచ్యుతాపురం రూరల్: స్థానిక ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాలలో ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు, అనాథలు, నిరుపేదలకు ఒకటి నుంచి పదో తరగతి వరకూ ఉచితంగా విద్య, వసతి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. వివరాలకు 9989719158, 7032054123 నంబర్లను సంప్రదించాలన్నారు.

పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ కార్యవర్గం ఎన్నిక



విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

అనకాపల్లి: విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడిగా పొన్నాడ వెంకట సత్య నర్సింహాచారి(పెదబాబు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక గవరపాలెం కామాక్షిదేవి ఆలయంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా యండపల్లి మోహన్ బ్రహ్మజీ, కోశాధికారిగా కిల్లాడ శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులుగా బెన్నాబత్తుల వెంకటరావు, కోసూరి మన్మథరావు, కొమ్మోజు రామకృష్ణ, కాకినాడ శ్రీనుతోపాటు 25 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి గోడి నర్సింహాచారి నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పెదబాబు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి సహాయ సహకారాలు పూర్తిగా అందిస్తానన్నారు. ఏటా మాదిరిగానే అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, రాష్ట్ర బంగారు వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల రాజేంద్ర, మాజీ కార్పొరేటర్ బోదులపాటి ఉమామహేశ్వరరావు, పట్టణ స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు వెదురుపర్తి సుందరయ్య (బాబి), పట్టణ కార్పెంటర్స్ సంఘం అధ్యక్షుడు కోరుకొండ వెంకట్రావు, పట్టణ విశ్వబ్రాహ్మణ మాజీ కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి భక్తుల తాకిడి



నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్లో భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం స్థానిక గవరపాలెం నూకాంబిక ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. ఇక్కడ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొంత మంది భక్తులు శనివారం పట్టణంలో వారి స్వగృహాలు వద్ద అమ్మవారి పాట నిర్వహించి, ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని దర్శించుకున్నారు. మరికొంత మంది భక్తులు ఆలయం వద్ద చలువ పందిళ్ల నీడలో వంటలు చేసుకుని నైవేద్యంగా అమ్మవారికి సమర్పించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో వెంపలి రాంబాబు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఉచిత మజ్జిగ, అమ్మవారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై విశేషంగా నృసింహ హోమం



కుంభ ప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో తదితరులు

సింహాచలం: సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం సింహగిరిపై శ్రీ నరసింహ హోమం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ఉత్తరరాజగోపురం ఎదురుగా ఉన్న విశాల ప్రాంగణంలో ఈ హోమాన్ని నిర్వహించారు. హోమంలో 22 మంది ఉభయదాతలు ప్రత్యక్షంగా, 87 మంది ఉభయదాతలు పరోక్షంగా పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందారు. ఉత్తరరాజగోపురం ఎదురుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భారీ వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులైన గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. హోమగుండం వద్ద విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.